# కలిసొచ్చిన అదృష్టం

'ఏంటే ఆ వయ్యారపు నడక? కేట్‌వాకా?' కులుకులొలక బోస్తూ వస్తున్న బ్లైండ్ భార్యామణిని, చూస్తూ వెటకారంగ మాట్లాడేడు మధు.

'డోన్టాక్! కేట్‌వాక్‌లు ర్యాట్‌వాకులు నాకు చేత కావు గుడ్డిదాన్ని కదా... దేనికైనా పొరపాటున తట్టుకు పడతానేమోనని అతి జాగ్రత్తగా వస్తున్నానంతే...! టిట్ ఫర్ టాట్ లాగ బదులిచ్చింది మృదుల.

గరిటకాల్చి వాతపెట్టినట్టుంది భార్య ఇచ్చినరిప్లై. అంచేత తనను తాను సంబాళించుకుని 'నీవాక్' ఎట్లా వున్నా... నీ టాక్' మాత్రం నచ్చటం లేదు. కప్పు అందుకుంటూ బదులిచ్చాడు.

'అప్పుడే మొహం మొత్తిందా? పెళ్లై రెండేళ్లయినా కాలేదు. అవున్లే... రైటర్ మహాశయులు కదా తమరు. అనేకానేక అభిరుచులుంటయ్ మరి! ఏవేవో వూహించేసుకుంటారు. కలల లోకంలో తేలిపోతుంటారు!- అవునూ... మీ ఆఫీసులో లేడీ కొలీగ్ ఎవరైనా వుందా?- లైనేస్తున్నారా?... ట్రై చేస్తున్నారా...' ఏడిపించాలనే అంది.

'షటప్!.. ఆడదానివైయుండి సాటి మహిళపై నిందమోపటానికి సిగ్గులేదూ!- నేన్నీ మొఒగుడుననే గౌరవం కూడా లేకుండా పోతుంది. సింగిల్ ఎపిసోడ్ లాగ మాట్లాడు దట్సాల్! ధారావాహిక సీరియల్ లాగ పేరాలు పేరాలు నోటికొచ్చినట్టు వాగకు... ఎహేట్ ఇట్!-'

'తమరు తెలుగు కథా రచయితలు కదా? ఇంగ్లీషు మాటలు మీ రచనల్లోనూ అలవోకగ దొర్లుతూ వుంటయ్ దేనికని?'

'అదా?! అదే మోడరన్ రైటర్స్ ఫ్యాషన్!- తెలుగు తెలుగంటూ ఇంగ్లీషు పదాలు దొర్లిస్తూంటారు. ఇదే నేటి రైటర్స్ కల్చర్. లేకపోతే కథ ఉప్పులేని పప్పులాగ చప్పగ వుంటుంది. ఎడిటర్‌కి నచ్చక చెత్త బుట్టపాలవుతుందా కథ!... ఎడిటర్ మహాశయులకు... కథలో ఎన్ని ఇతర భాషాపదాలు దొర్లితే అంత రంజుగ కథ వుంటుందనేది వారి భావన! పాఠకుల పల్స్ పసిగట్టి రాసిన నాలాంటి వాడే సక్సెస్ ఫుల్ రైటర్ కాగలడు...'

'గొప్పలకే మెచ్చెలెండి! డంబాలు పలికి డబ్బా వాయించుకోకండి. అయినా మీరు ఇంగ్లీషు కాన్వెంట్ స్టూడెంటా?... మీలాంటి రైటర్స్ వున్నారు కనుకనే తెలుగు భాషకు తెగులు పట్టింది....'

'ఇదిగో... నన్నేమైనా అను! నాప్రొఫెషన్‌ను అగౌరవపరిస్తే సహించను. అయినా గుడ్డి పెళ్లానివి నీకెంత పొగరే...'

'గుడ్డిదాన్ననేగా తెలిసీ చేసుకుంది...'

'అవునవును జాలిపడి చేసుకున్నాను. నా మిస్టేకే!.. మన్నించు డార్లింగ్...'

'షటప్! రాసేవి మాట్లాడేవీ అన్నీ అబద్ధాలే! నాకు దృష్టిలేకపోవచ్చు! గుడ్డి దాన్నే!- కానీ మీరైనా నిజంగా నన్ను ఇష్టపడి పెళ్లాడివుంటే అదేదో సినిమా పాటలాగ' నాకనులు నీవిగ చేసుకుని చూడు..! అని అభిమానించే వారే!- ఐనో మైడియర్ సార్?- నావెనుకనున్న డబ్బునే మీరు ప్రేమిస్తున్నారు.. కదూ?... నేనూ బ్రెలి లిపిలో డిగ్రీ చేశానండి... పిచ్చిదాన్నేం కాదు...'

'అవునవును! నీ టాలెంట్ నేనెరుగనిదా?-'

'ఏంటీ వెటకారమా?- నామనసెరిగి మసలటం నీకు బొత్తిగ చేతకాదు. చూపులేదన్న మాటే గానీ... నువ్వు అహంకారివి!- అయినా నీ ముగ్ధ మనోహర రూపానికి పరవశించి నిన్ను పెళ్లాడానని గ్రహించలేకపోతున్నావ్...'

'పొగడ్తలాపండి మహాశయా!- చూపులేకపోయినా నాకు అన్నీ తెలుసు. మీకు మాత్రం వంక లేదా?- కాలువంకరున్నా నేను వద్దనుకోలేదు. ఎందుకో తెలుసా? నన్ను మీ గుండెలో దాచుకుంటారని... ప్రేమతో... అభిమానంగా చూసుకుంటారని ఆశించాను కనుక!-'

'ఇద్దరికీ లొసుగులున్నాయ్. మన మధ్య వాదులాట దేనికి? మృదులా! నువ్వు పుట్టుగుడ్డివి- నేనా జన్మతహ కుంటివాడిని. పుట్టుకలోనే ఒక కాలు వొంకరతో పుట్టాను. నా అవిటి తనం నన్ను అనుక్షణం వెక్కిరించేది. దాన్ని మర్చిపోవాలనే నేను రైటర్ కావాలని కలలు కని... చివరికి అనుకున్నది సాధించగలిగాను. అదే నాకు సంతోషాన్ని... తృప్తినీ ఇస్తోంది. నన్ను అన్ని బాధలూ మర్చి పోయేలా చేస్తోంది.

రైటర్ మహాశయా! మరీ అంతగా కలల ప్రపంచంలో విహరించకండి!- నేల విడిచి సాము చేయద్దు!...

'నా మాటలు నీకు అర్థం కావులే మృదులా... ఎందుకో చెప్పనా?- నేను రాసిన ఏ ఒక్క కథ నువ్వు చదవలేదు కనుక...'

'నేను చదవలేనిదాన్నే అయినా... మీరు చదివి విన్పిస్తూనే వున్నారు కదా?...'

'అవునవును మృదులా ఐలైక్‌యు... ఐలవ్ యూ!...' అప్యాయంగ బాహువుల్లోకి తీసుకున్నాడు మధు.

ఇంతలో ఇంటి ముందు ఆటో ఆగిన చప్పుడు కావటంతో తల తిప్పి వీధిలోకి చూశాడు మధు.

వాట్ ఎవండర్?.... ఎప్పుడూ కార్లో తప్ప ప్రయాణం చేయని మామ మహాశయుడు ఈరోజు ఆటోలో దిగబడ్డాడేంటి చెప్మా అనుకున్నాడు.

'హౌ ఆర్ యు అల్లుడూ...' వస్తూనే పలకరించాడు సార్వభౌమరావు.

'డాడీ!... ఇదేనా రావటం..' వాయిస్ గుర్తించి అడిగింది మృదుల.

'అవునూ... మమ్మీని కూడా వెంటపెట్టుకు రాకపోయావా డాడీ...?' మళ్లీ మృదులే ప్రశ్నించింది.

'మీ అమ్మ సంగతి తెలుసుగా... ఎప్పుడూ ఏదో రోగం! ఎప్పుడూ మంచానికి అంటిపెట్టుకుని వుంటుంది. ఎక్కడికి రాదు. దానికి తోడు కారు రిపేరొచ్చింది. నేనే ఆటోలో వచ్చాను!

'కంపెనీకి అరడజన్ కార్లున్నయ్ కదా? ఫోన్ చేస్తే ఒకటి అవసరానికి రాకపోయిందా?...'

'అద్సరే గానీ... వంట మనిషిని మాన్పించావుట దేనికి? అదొచ్చి మీ అమ్మతో మొత్తుకుంది...'

'కూర్చోండి మామగారూ... నిలబడేవున్నారేం?-' మధు మర్యాద పూర్వకంగా అన్నాడు.

'ఉండండి డాడీ... ఇప్పుడే మీకు హార్లిక్స్ తెస్తాను'

'నాకేమీ వద్దు గానీ... ముందు వంట మనిషిని ఎందుకు మాన్పించావో అది చెప్పు?-' కూర్చుంటూ మళ్లీ అడిగేడు.

'అలవాటైన మనిల్లే కదా డాడీ ఇది. ఎక్కడేమున్నాయో తెల్సునాకు. అన్ని పన్లూనేనే చేసుకోగలుగుతున్నాను. ఇంకా ఆ మనిషిదేనికని..?

'చూడు మృదుల. నువ్వు తెలివైనదానివే కాదనను... కానీ నీకోమనిషి తోడు అవసరం. అందుకోసమైన మాన్పించకుండా వుండాల్సింది-'

'నేనూ అదే అన్నాను అంకుల్. మృదుల సంగతి తెలిసిందేగా... ఎవరిమాట వినదు. వట్టి మొండి మనిషి'

'స్టాప్ మధు! డాడీకి నా మీద పితూరీలా?-' నొసలు చిట్లించింది.

'సర్లే, అల్లుడునేమీ అనకు... నేను మిమ్మల్నిద్దరినీ దీపావళి పండుగకు మనింటికి రమ్మనిపిలవటానికొచ్చాను తల్లీ...!

ఎంతప్రేమగా మాట్లాడుతున్నాడో... వీర పిసినారి! అనవసరంగ ఆశపడి ఇతగాడి గుడ్డి కూతుర్ని చేసుకుని నా మెడకు ఉరేసుకున్నాను. తనను ఆర్థికంగా ఆదుకోకపోతే అతగాడి సొంత బంగళానే అయినా గుడ్డి దానితో విడి కాపురం పెట్టించి చచ్చాడు! కోటీశ్వరుడు కదా... తన రచనలు స్వంతంగ తనే పబ్లిష్ చేసుకోవచ్చు... సొంత ప్రెస్... పబ్లిషింగ్ కంపెనీ ఎస్టాబ్లిష్ చేసుకోవచ్చని ఏవేవో పిచ్చి కలలు కన్నాడు. తీరా చూస్తే ఏముంది తుస్‌మంది

తన ఆశ తలకిందులైంది. ఇంటి ఖర్చుకు తప్ప ఓ వెయ్యిరూపాలైన అదనంగా స్పేర్ చేయటంలేదు. నేనో అణాకానీ వుద్యోగం చేస్తుంటే పట్టికిలించకపోతే... తన కంపెనీకి ఎం.డి.ని చేయచ్చుగా! తను మాత్రం తెలివి చదువులేనివాడా? రైటర్‌గా మంచి పాపులారిటీ కూడా వుంది కదా.... ఉహుఁ! అంత మంచి పనెందుకు చేస్తాడు? ఒక్కగానొక్క కూతురికి అల్లుడినైనా నాపై చిన్న చూపు.... సీతకన్నే! ఇదేనచ్చని పాయింట్ ఆయన గారిలో! పేరు గొప్ప వూరి దిబ్బలాగ వుంది తన పరిస్థితీ. కనీసం ఓ స్కూటరైనా కొనివ్వలేదు. సిటీ బస్ లోనే ఆఫీసుకు తగలబడాల్సి వస్తోంది.

పైగా పలకరింపాకటి? బాగున్నావా? అని తల్చుకుంటునే ఒళ్లు మండుతోంది.

'అది సరే అల్లుడూ... అమ్మాయిని సరిగ్గా చూసుకుంటున్నావా?...'

'ఆహా! పువ్వుల్లో పెట్టుకుచూచుకుంటున్నాను...'

'ఆయన వెటకారపు మాటలకేంలే డాడీ రైటర్ కదా? హాస్యోక్తులు ఛలోక్తులు... వ్యంగోక్తులకేంతక్కువుండదు...!

'చూశారా... చూశారా... నా ధోరణి మీడాటర్ తలకెలా ఎక్కిందో?- రెండేళ్ల కాపురంలో మృదుల సగం రైటరైంది. భార్యంటే నాలో అర్ధభాగం కదా...?'

గుడ్డి దాన్ని పెళ్లాడి తనేదో గొప్ప త్యాగం చేశాననుకున్నాడు. పైగా తనూ కుంటివాడు కావటాన ఒప్పుకోక తప్పలేదు. కానీ కోట్లు మూలుగుతున్నా మామ శనీశ్వరుడని వూహించలేక పోవటం తన తప్పే.

ఆయన ప్రాణం గుటుక్కుమనేదాకా తన పని ఇంతే! అత్త వున్నా ఒకటే లేకున్నా ఒకటే! మంచం దిగని మనిషి! ఆమెతో ఎలాంటి ప్రాబ్లమ్ వుండదు. అధికారం పెత్తనం అంతా తన పరంకాక తప్పదు. గుడ్డి పక్షి అన్ని వ్యాపారాలను ఏం చూచుకునేడుస్తుంది?-

డబ్బున్న ఇంటి అల్లుడు కావటానికి తాను ఇష్టాన్ని... మనసును చంపుకోక తప్పలేదు. డబ్బుగల మామ ఏనాటికైనా అవసరానికి ఆదుకోకపోతాడని ఆశించటం పప్పులో కాలేయటం తన తప్పైంది.

ఏం చేయటం? బుద్ధీ ఖర్మానుసారిణి... ప్రాప్తం లేదు. అనుభవించే యోగం లేకుండా పోయింది. మృదులను చూద్దామా అంటే ఎంత సేపటికీ తనపైనే స్వారీ చేయాలని చూస్తుందే గాని తన అవసరాల గురించి తండ్రితో మాట్లాడ గల సత్తాలేదు.

అంతా తన బ్యాడ్‌లక్! అసలు తనలాంటి రైటర్ ఆయన అల్లుడైనందుకెంత గర్వించాలి? ఎంత సంతోషించాలి? ఎంత సహాయకారిగా వుండాలి?- అబ్బే! ఏమీ తెలియని శుంఠా గ్రేసరుడు మామైనందుకు ఇప్పుడు బాధపడి ఏం ప్రయోజనం... చేతులు కాలేక ఆకులు పట్టుకున్నటు..?

'రేపు బయల్దేరి మనింటికి రండి ఇరువురూ పండగకు నాలుగు రోజులుండి వచ్చేద్దురు గానీ...!

దేంట్లో రావాలి? ఆటోలోనా... సిటీబస్ లోనా? కనీసం కారైనా పంపుతాననడు. ముష్టి ఆహ్వానం ఎవడిక్కావాలట?-

ఈ ముదనష్టపోడు పెళ్ళాంతో కార్లో వెడుతున్నప్పుడు ఏ లారీ అయిన గుద్దేస్తే బావుండు. ఎంచక్కా ఇద్దరూ ఒకే సారీ హరీ అనేస్తారు. ఇద్దరి అంత్యక్రియలూ ఒకేసారి చేసేయవచ్చు! అప్పుడు యావదాస్తికి తనే కింగ్ అయిపోవచ్చు.

'ఏంటల్లుడూ? మూడిగా ఏదో ఆలోచిస్తున్నావ్? కొత్త కథకు 'ప్లాట్' ఏమైనా

యొచిస్తున్నావా?...'

అవున్రా రాస్కెల్! నువ్వు హరీ అనేదాకా ఆలోచిస్తూనే వుండాలి!... నా ఖర్మ ఇలాగే కాలాలి! మనసులో తనను తిట్టుకున్నాడు మధు.

'మరి పండక్కు బయల్దేరి మీరొచ్చే విషయం మాట తేల్చి చెప్పనే లేదు అల్లుడూ!.... చూడు' బెట్టు చెయ్యకుండా రండి! నామనసు మార్చుకున్నానయ్యా అల్లుడూ... నీకో మంచి... నోనో... గొప్ప గిఫ్ట్ ఇవ్వాలనుకుంటున్నాను.

అట్లాగా... అయ్యో... అనవసరంగ మామగారిని... పిల్లనిచ్చి నాయన్ను మనసులో నిందించి తప్పు చేశానే... అద్సరే.. ఏం ఇవ్వాలనుకుంటున్నాడో? ఆ గిఫ్ట్ ఏమిటో చేప్పేడిస్తే బాగుండు. కాస్తంత మనసు తేలిక పడుతుంది. ప్రాబ్లమ్ సాల్వ్ అవుతుంది...

'అల్లుడూ!- నువ్వా ముష్ఠి వుద్యోగం మానెయ్...'

ఆ(! మానేసి ఇంట్లో అంట్లు తోమించాలని ప్లానా?-

'చూడూ! నువ్వు రైటర్‌వి కదా? నీ చేతస్వంత ప్రెస్సు... పబ్లిషింగ్ కంపెనీ పెట్టించాలని నిర్ణయించుకున్నాను. అందుకోసం నీకో 'కోటి' రూపాయలు కేటాయించాను. ఇదిగో చెక్కు... తీసుకో... ఇదే నేనివ్వబోయే దీపావళి పండుగ గిఫ్ట్...'

చెక్కు చేతిలోకి తీసుకని చూచి చదివిన మధు కళ్లు బైర్లు కమ్మినయ్! ఇప్పటికి అదృష్టం కలిసొచ్చిందన్న మాట!... అనుకుంటూ మామగారి ముందు సాష్ఠాంగపడ్డాడు! 'మీ అంత గొప్పవాడిని కావాలంటూ దీవించండి మామగారూ...!

అల్లుడిని ఆశీర్వదించాడు సార్వభౌమరామ.

(విశాలాక్షి - మాసపత్రికలో ప్రచురితం)